క్లుప్తంగా...

మంత్రి కేటీఆర్‌ను కలిసిన గోషామహల్ నాయకులు



అబిడ్స్: రాష్ట్ర మంత్రి కేటీఆర్‌ను గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆశిష్ కుమార్ యాదవ్ కలిశారు. ఇటీవల విదేశీ పర్యటనకు వెళ్లి నగరానికి వచ్చిన మంత్రి కేటీఆర్‌ను బుధవారం బీఆర్ఎస్ నాయకుడు ఆశిష్‌కుమార్ యాదవ్ మొక్కను అందజేశారు. గోషామహల్ నియోజకవర్గ అభివృద్ధి, రాజకీయ పరిస్థితులను మంత్రికి ఆయన వివరించారు.

ఉజ్జయినిలో విక్రమ్ గౌడ్ పూజలు



అబిడ్స్: ఉజ్జాయినీలో గోషామహాల్ నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర బీజేపీ యువ నాయకుడు ఎం.విక్రమ్‌గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ మరోసారి ప్రధానమంత్రి అయ్యి అధికారంలోకి రావాలని ఆయన పూజలు నిర్వహించారు. ఈ పూజా వేడుకల్లో కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప కూడా పాల్గొన్నారు.

ఫ్లాట్ కేటాయింపు ఆర్డర్‌ను అందజేసిన ఎంపీ



చార్మినార్: ఏఐఎంఐఎం అధ్యక్షులు అసదుద్దీన్ ఓవైసీ దివంగత సయ్యద్ సైఫుద్దీన్ భార్య అంజుమ్ షాహీన్‌కు 2-బీహెచ్‌కే ఫ్లాట్ కేటాయింపు ఆర్డర్‌ను అందజేశారు. జూలై 31న జైపూర్-ముంబాయి రైలులో ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ చేతన్ సింగ్ కాల్చి చంపిన నలుగురిలో హైదరాబాద్ నివాసి సయ్యద్ సైఫుద్దీన్ ఒకరు. గతంలో సయ్యద్ సైపుద్దీన్ కుటుంబానికి పార్టీ తరపున ఓవైసీ కూడా ఆర్థిక సహాయం అందించారు.

నవరాత్రులను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలి

సుల్తాన్‌బజార్: గణపతి నవరాత్రులను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని సుల్తాన్‌బజార్ ఏసీపీ బాల గంగిరెడ్డి, ఇన్‌స్పెక్టర్ ముత్తులు సూచించారు. బుధవారం సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో గణేష్ మండపాల నిర్వహకులతో పోలీసులు సమావేశం నిర్వహించి మండప నిర్వహకులకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

17న మ్యాన్ ఆఫ్ ద వరల్డ్ సెలక్షన్స్

సుల్తాన్‌బజార్: ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ఔత్సాహిక యువకులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో మ్యాన్ ఆఫ్ ది వరల్డ్‌కు ఎంపిక చేసేందుకు ఈ నెల 17న రవీంద్రభారతిలో ప్రతిభా రూపాన్ని, వారి సామర్థ్యాల ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు ఎస్సీల్ సైన్, ఐకానిక్ ప్రొడక్షన్ ఆఫ్ ద వరల్డ్ డైరెక్టర్ రిషితా ముఖర్జీ తెలిపారు. ఈ మేరకు బుధవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రావ్య చల్లాతో కలిసి ఆమె మాట్లాడారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన యువకులకు మ్యాన్ ఆఫ్ ది వరల్డ్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 88868 84235 ఫోన్‌నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణి చేస్తున్న దేవర వంశీ తదితరులు

గోల్కొండ: దివంగత గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ స్థాపించిన జనహిత ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు మునుముందు కూడా కొనసాగిస్తామని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. బుధవారం జనహిత ట్రస్ట్ ద్వారా కార్వాన్‌లోని శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్ తదితరులున్నారు.

ఎటుచూసినా 'గణేష్ మహరాజ్'

జోరుగా వినాయక విగ్రహాల విక్రయం



చంద్రయాన్-3 వినాయకుడికి తుది మెరుగులు

అబిడ్స్ / జియాగూడ: ధూల్‌పేట్‌లో వినాయక విగ్రహాల విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. 6 నెలల ముందు నుంచే ధూల్‌పేట్ కళాకారుల చేతుల్లో విగ్రహాలు రూపుదిద్దుకుంటాయి. ధూల్‌పేట్‌లో ప్రతి గల్లీలో ఒక్క ఫీటు విగ్రహం నుండి 25 ఫీట్ల విగ్రహం వరకు తయారీ, అమ్మకాలు జరుగుతాయి. ప్రతి సంవత్సరం ధూల్‌పేట్ నుండి దాదాపు 30 వేలకు పైగా గణేష్ విగ్రహాలు అమ్ముడుపోతాయి. 18 నుండి గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయి. దీంతో ధూల్‌పేట ప్రాంతాలు గణేష్ విగ్రహాల విక్రయాలతో కిటకిటలాడుతుంది.

జోరుగా షోలాపూర్ విగ్రహాల అమ్మకాలు....

ధూల్‌పేటకు చిన్న గణపతుల విగ్రహాలు షోలాపూర్ నుండి దిగుమతి అవుతున్నాయి. అక్కడి షోలాపూర్ కళాకారులు ఎంతో అందంగా విగ్రహాలను తీర్చిదిద్దడంతో క్రమేణా విక్రయాలు ఊపందుకున్నాయి. ధూల్‌పేటలో పెద్ద విగ్రహాలతో పాటు షోలాపూర్‌కు చెందిన చిన్న విగ్రహాలు కూడా పెద్ద ఎత్తున అమ్మకాలు జరుగుతున్నాయి. చంద్రయాన్-3 వినాయక విగ్రహం తయారి తుదిమెరుగులు దిద్దుకుంటోంది.

తరలుతున్న గణనాథులు.....

వినాయక చవితి పండుగ 18 నుండి మొదలవుతుండడంతో తెలంగాణ రాష్ట్రం నుంచే కాక మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి వచ్చిన మండపాల నిర్వహకులు గణనాథులను కొనుగోలు చేసి తరలిస్తున్నారు. దీంతో ధూల్‌పేట పరిసరాలు కొనుగోళ్లు, విగ్రహాల తరలింపుతో కిటకిటలాడుతుంది. గోషామహల్ ట్రాఫిక్ విభాగం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది.



మండపాలకు తరలుతున్న భారీ వినాయకులు



విక్రయానికి సిద్ధంగా ఉన్న 25 ఫీట్ల గణనాథుడు



ఆకట్టుకుంటున్న షోలాపూర్ విగ్రహాలు

యువతకు బీఆర్ఎస్‌లో ప్రాధాన్యం



పార్టీలో చేరిన యువతకు పార్టీ కండువాలు కప్పిన మిత్రకృష్ణ

జియాగూడ: యువతకు బీఆర్ఎస్ ప్రాధాన్యత కలిప్తుందని కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ అన్నారు. బుధవారం జియాగూడ సాయిదుర్గానగర్‌కు చెందిన యువకులు సంఘ సేవకులు అత్తాపూర్ రాజేష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరగా మిత్రకృష్ణ వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్వాన్ నుండి దళితుడైన తనకు అసెంబ్లీ నుండి పోటీ చేసే అవకాశం లభించిందని భారీ మెజార్టీతో గెలిపించాలని యువతను కోరారు. యూత్‌నాయకుడు అభిషేక్ మిత్ర, మాజీ అధ్యక్షులు జడల మోహన్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు

చార్మినార్: గణేష్ నవరాత్రి ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న తెలిపారు. రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం చాంద్రాయణగుట్ట నర్కీపూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ భగవంత్ రావు, ఉపాధ్యక్షులు నర్సింగ్ పునియా కరోడీ, సభ్యులు, పలు విభాగాల అధికారులతో కలిసి జోనల్ కమిషనర్ ఏర్పాట్లపై సమన్వయ సమావేశం నిర్వహించారు. జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ఉత్సవ సమితి సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ...అన్ని ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. జాయింట్ కమిషనర్ శైలజా, ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రాజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అవసరాల కోసమే సేవా కేంద్రాలు

గోల్కొండ: ప్రజల సౌకర్యం కోసం మజ్లీస్ పార్టీ వివిధ రకాల సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన నానల్‌నగర్ డివిజన్ హకీంపేట్‌లో ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డు ఉచిత క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ఇటువంటి సేవా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు. మజ్లిస్ నాయకులు ఆలీముద్దీన్, సయ్యద్ జబ్బార్ తదితరులున్నారు.



హకీంపేట్‌లో ఆరోగ్య శ్రీ ఉచిత సేవా కేంద్రంలో ఎమ్మెల్యే కౌసర్

భక్తిశ్రద్ధలతో పూజలు

గౌలిపురా: కన్యాకపరమేశ్వరి భవనంలో లాల్‌దర్వాజా గౌలిపురా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రావణ బహుళ త్రయోదశి మాస శివరాత్రి సందర్భంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మండపారాధన, 54 మంది జంటలతో సామూహిక రుద్రాభిషేకం, శివ సహస్రనామ యజ్ఞం, సాయిబాబా వ్రతం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు సరాబు లక్ష్మణ్ గుప్తా, జిల్లా మాజీ అధ్యక్షులు కాశెట్టి పాండు గుఆప్త, మ్యాడం దయాకర గుప్తా హాజరయ్యారు.

అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తప్పవు

దూద్‌బౌలి: అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని... అలాగే రోడ్డు విస్తరణలో భవనాలు కోల్పోయిన వారు అక్రమంగా బాల్కనీలు వేస్తే కూల్చివేస్తామని టౌన్ ప్లానింగ్ ఏసీపీ అబ్దుల్ ఖదీర్ అన్నారు. బుధవారం దూద్‌బౌలి, సుఖ్‌వీర్ కమాన్ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలతో పాటు అక్రమంగా బాల్కనీలు వేసిన వాటిని కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... జీహెచ్ఎంసీ మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాలను కూల్చివేశామన్నారు. ఈ కూల్చివేతల సందర్భంగా భవన యజమానులు, స్థానికులు మున్సిపల్ అధికారులతో వాగ్వాదానికి స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. దీంతో అక్కడే ఉన్న పోలీసులు భవన యజమానులను సముదాయించి కూల్చివేతలను కొనసాగించారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారి మునావర్ అలీ, శివసింగ్, యోగేందర్ గౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షపాతి గద్దర్

గన్‌ఫౌండ్రీ: ప్రజా జీవితంలో 50 సంవత్సరాల పట్లు ప్రజల పక్షపాతిగా గద్దర్ నిలిచారని తెలంగాణ ప్రెస్ అకాడమి ఛైర్మన్ అల్లం నారాయణ అన్నారు. బుధవారం నిజాం కళాశాలలో కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రజా సాహిత్యం - గద్దర్ పాత్ర అనే అంశంపై సాహిత్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ..... ఆట, మాట, పాట గద్దర్‌తోనే ప్రారంభమైందని గుర్తుచేశారు. అణగారిన వర్గాల సంస్కృతిని పాట రూపంలో తీసుకువచ్చారన్నారు. తన 50 సంవత్సరాల ప్రజాజీవిత కార్యచరణ సమాజంపై ఎంతో ప్రభావం చూపిందని తెలిపారు. పేదప్రజల తరపున గద్దర్ వినిపించిన రాగాలను ఎంతోమంది అనుసరించి అనుకరించారని కొనియాడారు. శాసన మండలి సభ్యులు గోరటి వెంకన్న మాట్లాడుతూ..... గద్దర్ పాటకు అలంకారమైన భాషను అల్లిన వ్యక్తి అని పేర్కొన్నారు. అరుణోదయ సాంస్కృతిక మండలి అధ్యక్షురాలు విమలక్క మాట్లాడుతూ..... గద్దర్‌ది విస్తృతమైన ప్రజా సాహిత్యమని, గద్దర్ స్ఫూర్తితో నేడు బలమైన ప్రజా సాంస్కృతిక ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. సినీ దర్శకులు బి.నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

గోల్కొండ: దివంగత గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ స్థాపించిన జనహిత ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు మునుముందు కూడా కొనసాగిస్తామని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. బుధవారం జనహిత ట్రస్ట్ ద్వారా కార్వాన్‌లోని శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణి చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్ తదితరులున్నారు.

శాతం చెరువులో పూడికతీత పనులు.

గోల్కొండ: గోల్కొండ నయా ఖీలా కందకానికి ఆనుకొని ఉన్న శాతం చెరువులో పూడికతీత పనులు ప్రారంభమయ్యాయి. గత నెలతో పాటు ఈ నెలలో సైతం కురిసిన భారీ వర్షాలకు ఈ చారిత్రక చెరువు వర్షపు నీటితో నిండిపోయింది. ఈ చెరువులో వరద నీటితో పాటు కొట్టుకువచ్చిన ఎన్నో వ్యర్థాలు కూడా చేరాయి. రెండు రోజులుగా ఈ పూడిక తీత పనులు జోరుగా జరుగుతున్నాయి.

కార్వాన్‌లో కాంగ్రెస్ నేతల పాదయాత్ర

పాదయాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

గోల్కొండ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను తిరస్కరించడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గం సీనియర్ నాయకులు కురాకుల కృష్ణ అన్నారు. బుధవారం కార్వాన్ డివిజన్‌లో ఆయన ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ మెజార్టీతో అధికారంలోకి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాములు, వనజ, జ్యోతి, చంటిబాబు తదితరులున్నారు.

ప్రజావైద్యరంగంలో అనేక మార్పులు

గోల్కొండ: కేంద్ర ప్రభుత్వ సౌజన్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఆయుష్మాన్‌భవ అభియాన్ కార్యక్రమం ద్వారా ప్రజా వైద్య రంగంలో ఎన్నో మార్పులు వస్తాయని గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరెంటెండ్ డాక్టర్ మజర్‌ఉల్లా అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా బుధవారం ప్రారంభించిన ఆయుష్మాన్ భవ అభియాన్ కార్యక్రమం ద్వారా రాష్ట్రపతి ద్రౌపతిముర్ము ఇచ్చిన సందేశాన్ని గోల్కొండ ఏరియా ఆసుపత్రి వైద్యులు టీవీపై వీక్షించారు. అనంతరం డాక్టర్ మజర్‌ఉల్లా మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యానికి సంబంధించిన ఎన్నో అంశాలపై ఈ కార్యక్రమం దృష్టిసారిస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ ఏ.శ్రీనివాస్‌రావు, వైద్య బృందం, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ బంధు చెక్కుల పంపిణీ

విజయనగర్‌కాలనీ: అర్హులందరికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందేలా నాయకులు, అధికారులు కృషి చేయాలని నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్‌హుస్సేన్ మేరాజ్ అన్నారు. బుధవారం విజయనగర్‌కాలనీ డివిజన్‌లోని ప్రియాగార్డెన్‌లో బీసీ బంధు చెక్కులను లబ్దిదారులకు అందజేశారు.

ప్రజా ఆరోగ్య పథకాలను సద్వినియోగం చేసుకోండి

యాకుత్‌పురా: ప్రభుత్వాలు అందజేసే ప్రజా ఆరోగ్య పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ సూచించారు. యాకుత్‌పురా-2 యుపీహెచ్‌సీలో బుధవారం నిర్వహించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ వ్యాప్తంగా ప్రారంభించిన ఆయుష్మాన్ భవ జాతీయ హెల్త్ స్కీమ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్య విధాన పరిషత్ డబీర్‌పురా క్లస్టర్ ఎస్పీహెచ్ఓ డాక్టర్ అంజీలా అల్ఫ్రెడ్ పాల్గొన్నారు.

ఆయుష్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

అబిడ్స్: ఆయుష్‌లోని పలు విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఉద్యోగులు సమస్యలతో సతమతమవుతున్నా..... పరిష్కారం కావడం లేదన్నారు. బుధవారం ఆయుష్ డైరెక్టర్ హరిచందనను కలిసి ఎస్ఎం.ముజీబ్ హుస్సేని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ..... ఆయుష్ సబార్డినేట్ యూనిట్లలో ఉన్న సమస్యలన్నీ వేగవంతంగా పరిష్కరించాలన్నారు. డైరెక్టర్ హరిచందన స్పందిస్తూ అధికారులకు వివరించి వేగవంతంగా అన్ని విభాగాల సమస్యలు పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బొల్లిగడ్డ శంకర్, ఆయుష్ ప్రెసిడెంట్ టీఎస్.చారి పాల్గొన్నారు.



డైరెక్టర్ హరిచందనకు వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ ముజీబ్ హుస్సేని

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి



నిర్వాహకులతో సమావేశమైన నగర పోలీస్ అడిషనల్ కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్ తదితరులు

అబిడ్స్: గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించాలని నగర పోలీస్ అడిషనల్ కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్ పేర్కొన్నారు. మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం గణేష్ విగ్రహాల తయారీదారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విక్రమ్‌సింగ్ మాన్ మాట్లాడుతూ...... పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి గణపతుల తయారీకే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్ ఖారే, గోషామహాల్ ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి, మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుకు తుది గడువు 19 వరకు

చార్మినార్: రెండో ప్రత్యేక సమ్మరి రివిజన్ 2023 కార్యక్రమంలో భాగంగా ఓటర్ నమోదు, అభ్యంతరాలు, సవరణలకు ఈ నెల 19వ తేదీ చివరి తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని చార్మినార్ సర్కిల్-9 డిప్యూటీ కమిషనర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి డీడీ నాయక్ సూచించారు. బుధవారం మొఘల్‌పురా జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని సర్కిల్-9 కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో డిప్యూటీ కమిషనర్ డీడీ నాయక్ ఓటర్ల నమోదు ఏర్పాటు తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ పాల్గొని మాట్లాడుతూ... బూత్‌స్థాయి అధికారులు క్రియాశీలకంగా వ్యవహరించి తప్పులు లేకుండా ఓటర్ జాబితాను తయారు చేయాలన్నారు. డీడీ నాయక్ మాట్లాడుతూ.. ఓటర్ నమోదుకు చివరి అకాశమని.. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిని చాముండేశ్వరి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు వెంకటేశ్, మూసా ఖాసిం, మహ్మద్ సోహేల్, ఎం.ఎ.సలాం, హైదర్ అలీ జాఫ్రీ తదితరులు పాల్గొన్నారు.



వివిధ పార్టీల నాయకులతో సమావేశమైన డీడీ నాయక్

వన్యప్రాణుల సంరక్షణకు పలు సూచనలు అందజేసిన నిపుణుల కమిటీ



జూపార్కులో నిపుణుల కమిటీ సభ్యులతో సమావేశమైన వైల్డ్‌లైఫ్ పీసీసీఎఫ్ చీఫ్ వార్డెన్ లోకేశ్ జైశ్వాల్

బహదూర్‌పురా: వన్యప్రాణుల సంరక్షణ, జూపార్కు పరిశుభ్రతపై సెంట్రల్ జూ అథారిటీ సంస్థ, వీబీఆర్ఐ వెటర్నరీ కళాశాల, జీహెచ్ఎంసీ ద్వారా విలువైన సమాచారాన్ని సేకరించామని వైల్డ్‌లైఫ్ పీసీసీఎఫ్ చీఫ్ వార్డెన్ లోకేశ్ జైస్వాల్ తెలిపారు. నెహ్రూ జూలాజికల్ పార్కులో బుధవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వన్యప్రాణుల ఆరోగ్య సంరక్షణ, పరిశుభ్రతపై సెంట్రల్ జూ అథారిటీ వెటర్నరీ నిపుణులు జూపార్కును సందర్శించి విలువైన సమాచారాన్ని వన్యప్రాణుల అభివృద్ధి కమిటీ సభ్యులు అందజేశారన్నారు. భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, సెంట్రల్ జూ అథారిటీ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో యూనైటెడ్ ఫర్ బిగ్ క్యాట్ అనే అంశంపై అవగాహన ప్రచారాన్ని నిర్వహించామన్నారు. సెప్టెంబర్ 17వ తేదీ వరకు ఈ ప్రచారాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. రాష్ట్ర జూపార్కుల డైరెక్టర్ వీఎస్ఎన్‌వీ ప్రసాద్, జూపార్కు క్యూరేటర్ డాక్టర్ సునిల్ ఎస్ హిరేమత్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

సుల్తాన్‌బజార్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం సెల్ఫ్ ఫైనాన్స్ కాంట్రాక్ట్ టీచర్స్ అధ్యక్షులు డాక్టర్ ఎస్.నర్సింహారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం పరిధిలోని కాంట్రాక్టు అధ్యాపకులు రిలే నిరహారదీక్షలో పాల్గొని వారి నిరసనను ప్రభుత్వానికి నివేదించారు. గత రెండు వారాలుగా వారు నిరసనలను వివిధ రూపాలలో తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నర్సింహారావు మాట్లాడుతూ...... కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని గత రెండు వారాలుగా తాము నిరసనలు వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఆశ్లేష, డాక్టర్ రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

ఏబీవీపీ నూతన కార్యవర్గం

చార్మినార్: భారతదేశ పునర్ నిర్మాణమే ఏబీవీపీ లక్ష్యమని... విద్యార్థుల్లో జాతీయ భావం నింపుతూ నమ్మిన సిద్ధాంతం కోసం జాతీయత మా ఊపిరి-దేశభక్తి మా ప్రాణం నినాదంతో జాతీయ జెండా కోసం నిస్వార్థంగా పని చేస్తూ 42 మంది ప్రాణాలు ఇచ్చిన ఘనత ఏబీవీపీ అని ఏబీవీపీ గ్రేటర్ హైదరాబాద్ మహా నగర సంఘటన మంత్రి విష్ణువర్ధన్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ సిటీ కళాశాలలో బుధవారం ఏబీవీపీ కళాశాల కమిటీని ఎన్నిక సమావేశానికి అతిథిగా కోఠి జిల్లా కన్వీనర్ సభావట్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఏబీవీపీ ప్రపంచంలోనే అతి పెద్ద స్టూడెంట్ ఆర్గనైజేషన్.. స్టూడెంట్‌కి ఎలాంటి సమస్యలు వచ్చినా సమస్యలు తీర్చడానికి ముందుండి ప్రాణాలకు తెగించి కొట్లాడే ఆర్గనైజేషన్ ఏబీవీపీ అన్నారు. అనంతరం ఏబీవీపీ కళాశాల కమిటీని ఎన్నుకున్నారు.

పోలీసులకు ఫేక్ కాల్ చేసిన వ్యక్తికి జైలు

విజయనగర్‌కాలనీ: హత్య జరిగిందని పోలీసులకు ఫేక్ కాల్ చేసి పరుగులెత్తించిన ఓ వ్యక్తికి బుధవారం జైలుశిక్ష పడిన సంఘటన ఆసీఫ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం..... ఆసిఫ్‌నగర్ జేబాబాగ్‌లో నివసించే గులామ్ మజార్ ఈ నెల 8న మధ్యాహ్నం సిఫ్‌నగర్‌లో హత్య జరిగిందని 100 నెంబర్‌కు తన సెల్‌ఫోన్ ద్వారా ఫోన్ చేసి స్విచ్ ఆఫ్ చేశాడు. దీంతో ఆసీఫ్‌నగర్ పోలీసులు ఆసిఫ్‌నగర్ జేబాబాగ్‌కు హుటాహుటినా చేరుకుని విచారించగా ఇక్కడ ఎటువంటి హత్య జరగలేదని స్థానికుల ద్వారా తెలిసింది. సాంకేతిక ఆధారాలతో ఫోన్‌చేసిన వ్యక్తి ఇంటి చిరునామాకు వెళ్లి గులామ్ మజర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా ఊరికే ఫోన్ చేసినట్లు ఒప్పుకున్నాడు. అతడిపై కేసు నమోదు చేసి నాంపల్లి స్పెషల్ మెట్రోపాలిటన్ 4వ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా కేసు వివరాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

డాక్టర్ విశ్వేశ్వరయ్య స్మారక అవార్డుకు ముగ్గురు ప్రొఫెసర్ల ఎంపిక

అఫ్జల్‌గంజ్: జాతీయ ఇంజనీర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్రం నుండి ముగ్గురు ప్రొఫెసర్లకు డాక్టర్ విశ్వేశ్వరయ్య స్మారక అవార్డులను ప్రధానం చేస్తున్నట్లు తెలంగాణ మేధావుల ఫోరం అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం అఫ్జల్‌గంజ్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇంజనీరింగ్ రంగంలో అపార సేవలు అందిస్తున్న ముగ్గురు ప్రొఫెసర్లకు భారతరత్నా ఎం విశ్వేశ్వరయ్య స్మారక అవార్డు 2023కి ఎంపిక చేసినట్లు తెలిపారు. అనురాగ్ యూనివర్సిటీ వైస్ చాన్సలార్, ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సిలార్‌లు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తారన్నారు. ఉస్మానియా యనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, ప్రొఫెసర్ గద్దం మల్లేషం, కమలా నెహ్రూ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పుప్పాల అనిల్ కుమార్‌లను అవార్డులకు ఎంపిక చేశామన్నారు. అవార్డుల ప్రధాన కార్యక్రమం ఈ నెల 15న ఉస్మానియా యూనివర్సిటీలోని అసెంబ్లీ హాల్‌లో జరగనుందని తెలిపారు.